సాక్షి ప్రకాశం

శనివారం । 29 । జూలై । 2023



నూరు.. హుషారు
మంత్రి ఆదిమూలపు సురేష్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి నేటికి వంద రోజులు పూర్తయింది.
- IIలో..



పాతిక వేల మందికి ఇళ్లస్థలాలు
ఒంగోలు నగరంలో పాతిక వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు.
- IIలో..

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 32/26

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధితుడికి రూ.50 లక్షల పరిహారం చెల్లించండి

- వైద్యుల నిర్లక్ష్యంతో చేయి కోల్పోయిన బాలుడి కేసులో వినియోగదారుల కమిషన్ సంచలన తీర్పు
- పరిహారంపై ఆస్పత్రి, బీమా కంపెనీలకు ఆదేశం
- ఫిర్యాది మనోవేదనకు పరిహారంగా మరో రూ.10 లక్షలు, కోర్టు ఖర్చులకు రూ.25 వేలు

ఒంగోలు: వైద్యుల నిర్లక్ష్యంతో చేయి కోల్పోయిన బాధితుడికి సదరు ఆస్పత్రి, బీమా కంపెనీలు సంయుక్తంగా రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలంటూ ప్రకాశం జిల్లా వినియోగదారుల కమిషన్ శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళ్తే.. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన గోసు సుబ్బారావు కుమారుడు గోసు ధీరజ్ యాదవ్ (9) 2021 మే 5న ప్రమాదవశాత్తు డాబాపై నుంచి కింద పడి చేతికి దెబ్బలు తగలగా, టంగుటూరులోని మాధురి నర్సింగ్‌హోంకు వెళ్లారు. అక్కడ పీవోపీ కట్టు కట్టడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కట్టును బాగా బిగించి కట్టడంతో చేయి వాపు వచ్చి, రంగు మారింది. దీంతో బాలుడు నొప్పి తట్టుకోలేకపోవడంతో మరుసటిరోజు ఆస్పత్రికి వెళ్లగా వారు కట్టు మార్పు చేశారు. కానీ బాలునికి ఎటువంటి ఉపశమనం లభించలేదు. దీంతో తండ్రి బాలుడ్ని వెంటనే చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వారు బాలుడి పరిస్థితి చూసి కట్టు బాగా బిగించి కట్టడంతో రక్త ప్రసరణ నిలిచిపోయిందని, దీంతో ఇన్ఫెక్షన్ ప్రారంభమై, గాంగ్రీన్‌కు కారణమైనట్లు తెలిపారు. ప్రస్తుతం బాలుడి చేయి తొలగించకపోతే ప్రాణానికే ప్రమాదం అంటూ పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బాలుడి చేయి తొలగించాల్సి వచ్చింది. దీంతో టంగుటూరు వైద్యుని నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడు కుడిచేయి కోల్పోయాడంటూ ఫిర్యాదిదారుడు ప్రకాశం జిల్లా వినియోగదారుల కమిషన్‌ను 2021 అక్టోబర్ 18న ఆశ్రయించారు. కమిషన్ పూర్వాపరాలను పరిశీలించి నష్టపోయిన బాధితునికి నష్టపరిహారంగా మాధురి నర్సింగ్‌హోం, బీమా కంపెనీలు సంయుక్తంగా రూ.50 లక్షలు చెల్లించాలని, ఫిర్యాదిదారుని మనోవేదనకు పరిహారంగా మరో రూ.10 లక్షలు, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు చెల్లించాలని కమిషన్ ప్రెసిడెంట్ దుగ్గెంపూడి శ్రీదేవి, సభ్యులు వై.సుందరరావు, డాక్టర్ ఎస్‌పి సమీరా శుక్రవారం తీర్పు వెలువరించారు.



అటవీ ప్రాంతంలో తిరుగుతున్న పెద్దపులులు

రూపంలో రాజసం..ఒళ్లంతా పౌరుషం..ఉట్టిపడే గాంభీర్యం..పొగరుకు మారుపేరు.. మృగరాజుకు తీసిపోని దర్పం.. వేటలో దానికదే సాటి.. దానిపేరు వింటేనే వణుకు. దానిని ఎదిరించి నిలబడడం ఓ సాహసం.. అది పంజా విసిరితే ఎంతటి ప్రత్యర్థి అయినా నేలకొరగాల్సిందే. అదే బెంగాల్ టైగర్.. ఈ చారల పులి వెరీ స్పెషల్.. వెరీ పవర్ ఫుల్.. వీటికి కేరాఫ్ అడ్రస్‌గా ఉంది నల్లమల అటవీ ప్రాంతం. వీటి ఉనికిని కాపాడేందుకు అటవీశాఖ ప్రత్యేక సంరక్షణ చర్యలు చేపట్టింది. నాగార్జున సాగర్– శ్రీశైలం పులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్) పరిధిలో 70 బేస్ క్యాంపుల్లో 800 మంది కాపలా కాస్తున్నారు. సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచారు. ఫలితంగా వీటి సంఖ్య ఏటా పెరుగుతూ వస్తోంది. ఐదేళ్ల కిందట వీటి సంఖ్య 50 ఉంటే నేడు అధికారికంగా 80 ఉండగా అనధికారికంగా 100కు పైగానే ఉంటాయి. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- పెరుగుతున్న పులుల సంతతి
- అధికారికంగా 80 పులుల గుర్తింపు
- అనధికారికంగా 100కు పైనే
- 70 బేస్ క్యాంపులో 800 మంది కాపలా
- సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- వేటగాళ్లకు చెక్..మూడు నెలలు పర్యాటకానికి బ్రేక్
- వీటి జీవనశైలి అంతా విభిన్నం
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం



నల్లమలలో సంచరిస్తున్న పెద్దపులి

వేట నాదే.. అడవీ నాదే..

ఒంగోలు డెస్క్

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, గుంటూరు, కర్నూలు, తెలంగాణలో మహబూబ్‌నగర్ జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాల్లో విస్తరించి ఉంది నల్లమల అటవీ ప్రాంతం. అందులో 3568 చదరపు కిలో మీటర్ల పరిధిలో ఎన్ఎస్‌టీఆర్ విస్తరించి ఉంది. వీటి పరిధిలో గత ఏడాది దాదాపు 73 పెద్ద పులులు ఉండగా, ఈ ఏడాది ఈ సంఖ్య 80కి పైగా చేరింది. వీటితో పాటు 400 కు పైగా చిరుతలు, జింకలు, దుప్పులు తదితర వన్యప్రాణులకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మార్కాపురం డీఎఫ్‌ఓ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, గంజివారిపల్లె, గుంటూరు జిల్లాలోని విజయపురిసౌత్ రేంజ్‌లు ఉండగా, గిద్దలూరు పరిధిలో గిద్దలూరు, గుండ్లకమ్మ, తురిమెళ్ల, కనిగిరి, ఒంగోలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం 62 పెద్ద పులులు ఉండగా వీటి సంఖ్య గత ఏడాది 73కు చేరగా ఇప్పుడు 80కి పెరిగింది. ఇటీవలే పులుల లెక్కింపు కూడా పూర్తయింది. కెమెరాలకు చిక్కకుండా తిరిగే పులులు కలుపుకుంటే వంద పైనే ఉంటాయని వన్యప్రాణి పరిశోధకులు అంటున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం నల్లమలలో 50 ఆడ, 30 మగ పెద్ద పులులు ఉన్నట్లు అంచనా వేశారు. ఇటీవల కాలంలో 10 పెద్దపులులు నల్లమల నుంచి మహబూబ్‌నగర్ అటవీ ప్రాంతం మీదుగా తెలంగాణ అటవీ ప్రాంతానికి వెళ్లినట్లు సీసీ కెమెరాల ట్రాకింగ్‌లో గుర్తించారు.



అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లో నల్లమల అభయారణ్యంలోని పులులకు సంబంధించిన బొమ్మలతో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం జిల్లా నుంచి పలువురు అటవీ శాఖ ఉన్నతాధికారులు అక్కడికి వెళ్లారు.

నిరంతరం నిఘా:
పెద్ద పులుల సంరక్షణకు నల్లమల అటవీ ప్రాంతంలో మొత్తం 70 బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. 800 మంది సిబ్బందిని పులులకు ప్రొటెక్షన్ వాచర్లుగా నియమించారు. వీరు నిరంతరం అడవిలో తిరుగుతూ పులుల సంరక్షణపై దృష్టి పెడతారు. పులుల కదలికలను ట్రాక్ చేస్తారు. సీసీ కెమెరాల ద్వారా కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నారు. ఉన్నత స్థాయిలో సెక్షన్ ఆఫీసర్, ఆపైన డీఎఫ్‌ఓలు ప్రతి రోజు అడవిలో ఏం జరుగుతోందో గమనిస్తూనే జంతువుల కదలికలపై సమాచారం సేకరిస్తారు. బేస్ క్యాంప్‌లను గంజివారిపల్లె సమీపంలోని పెద్దన్న బేస్ క్యాంప్, నారుతడికల, పాలుట్ల, ఇష్టకామేశ్వరి, డొరబైలు, కొలుకుల, తుమ్మలబైలు, వెదురుపడియ, చినమంతనాల, రోళ్లపెంట, కొర్రపోలు, తదితర ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇందులో అటవీశాఖ సిబ్బంది ఉంటారు. అడవిలోకి వేటగాళ్లు వెళ్లకుండా ఉండేందుకు కొర్రపోలు, శిరిగిరిపాడు, దోర్నాల గణపతి గుడి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నల్లమల ప్రాంతాన్ని కేంద్రం గతంలోనే రాజీవ్ టైగర్ అభయారణ్యంగా ప్రకటించింది. ఇక రాత్రిపూట శ్రీశైలం వెళ్లే ప్రయాణికులను దోర్నాల చెక్‌పోస్టు వద్ద రాత్రి 9 గంటలకే నిలిపేస్తున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చే వాహనాలను కూడా ఈగలపెంట వద్ద అక్కడి చెక్‌పోస్టు సిబ్బంది 9 గంటలకు నిలిపేస్తున్నారు. ఫలితంగా రాత్రిపూట పెద్దపులులు, చిరుత పులులు, జింకలు, రేసుకుక్కలు, తదితర అటవీ జంతువులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంది. రాత్రి సమయంలో అడవి జంతువులు వచ్చి దాహం తీర్చుకుంటాయి.

సంతతి పెరిగేలా..
పులుల సంతతి పెరిగేలా అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. వీటి మేటింగ్‌కు జూలై 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అనుకూలమైన కాలంగా గుర్తించారు. దీంతో మూడు నెలల పాటు నల్లమల అటవీ ప్రాంతంలో పర్యాటకానికి నిషేధం విధించారు. జంగిల్ సఫారీ, ఇష్టకామేశ్వరి గుడి తదితర ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. ఎవరైనా వెళితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు.

పులి సామ్రాజ్యం ప్రత్యేకం:
పులులు తమ కోసం ఓ సామ్రాజ్యాన్ని స్థాపించుకుంటాయి. సాధారణంగా ఒక మగ పులి తన ఆహార లభ్యతను బట్టి తన విహార ప్రాంతాన్ని గుర్తిస్తుంది. నల్లమలలో ఒక పులి సాధారణంగా తన ఆధీన ప్రాంతం (టెరిటరీ) 50 చ.కి.మీ గా ఉంచుకుంటుంది. అయితే తన భాగస్వామి, ఆహారం కోసం 200 చ.కి.మీ. పరిధి వరకు విహరిస్తుంది. అదే రాజస్థాన్‌లోని రణతంబోర్ పులుల అభయారణ్యంలో అది ఇందులో సగం మాత్రమే ఉంటుంది. పులి తన మూత్రం వెదజల్లడం ద్వారా తన టెరిటరీ సరిహద్దులను నిర్ణయించుకుంటుంది.



అంతా విభిన్నం..
పెద్దపులి జీవన విధానం. వేట అంతా విభిన్నం. చూపులో తీక్షణం..మాటు వేసి పంజా విసిరిందంటే ఎంతటి శక్తివంతమైన ప్రత్యర్థి అయినా నేలకొరగాల్సిందే. మగపులి బరువు 200 నుంచి 300 కేజీలు, ఆడపులి బరువు 100 నుంచి 180 కేజీల వరకు ఉంటుంది. దీని ఎత్తు 4 అడుగుల వరకు ఉండి, పొడవు 8 నుంచి 9 అడుగుల వరకు ఉంటాయి. ఒక పులి మూడేళ్లకోసారి పిల్లల్ని కంటుంది. ఒకే సారి రెండు నుంచి నాలుగు పిల్లలకు జన్మనిస్తుంది. ఒకటిన్నర సంవత్సం పాటు వాటికి వేటాడడం.. ఆహారం తినడం అన్నీ నేర్పిస్తుంది. తర్వాత అడవిలో వదిలేస్తుంది.



ప్రత్యేక రక్షణ చర్యలు



నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఈ వేసవిలో వన్యప్రాణులు నీటి కోసం జనవాసాల్లోకి రాకుండా ఉండేందుకు 151 సాసర్‌పిట్‌లు ఏర్పాటు చేసి నీరు అందించాం. వన్యప్రాణుల సంరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం, ప్రస్తుతం పులుల బ్రీడింగ్ జరుగుతోంది. సెప్టెంబరు 30 వరకూ పర్యాటక ప్రదేశాలన్నింటినీ మూసివేశాం.
– విఘ్నేష్ అప్పావు, డిప్యూటీ డైరెక్టర్, మార్కాపురం.

నగరం దశ తిరిగేలా..


- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 25 వేల మందికి ఇళ్ల పట్టాలకు సిద్ధం
- రూ.340 కోట్ల మంచినీటి పథకానికి శంకుస్థాపన
- టీడీపీ హయాంలో మూతపడిన ఒంగోలు డెయిరీకి పూర్వవైభవం
- ఆగస్టులో నగరానికి సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు నగరానికి మహర్దశ పట్టనుంది. దశాబ్దాలుగా నగర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తీర్చేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. నగరం ఏర్పడినప్పటి నుంచి గుక్కెడు నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దుస్థితి అందరికీ తెలిసిందే. ఎన్ని ప్రభుత్వాలు మారినా పరిస్థితిలో మార్పు మాత్రం రాలేదు. రూ.2500 కోట్లతో నగరాన్ని అభివృద్ధి చేశామంటూ టీడీపీ నేతలు మాయమాటలు చెబుతూనే ఉన్నారు. టీడీపీ పాలనలో నగర ప్రజలు ఎదుర్కొనే ఏ ఒక్క సమస్య తీర్చని పరిస్థితి. మంచినీటి సమస్య, నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన, రోడ్ల అభివృద్ధి ఇలా చెప్పుకోదగ్గ పని ఏదీ చేయకుండా రోడ్ల మీద రోడ్లు వేసి డబ్బులు దండుకొని ప్రజల ఛీత్కారానికి గురయ్యారు. అమృత్ పథకం ద్వారా తాగునీటి కష్టాలు తీరుస్తామంటూ అప్పట్లో హడావుడి చేసి కమీషన్లు బొక్కేసి ఒంగోలు నగరపాలక సంస్థపై రూ.70 కోట్లు భారం వేశారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే చిత్తశుద్ధితో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి సారించి నగర ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య తీర్చేందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి రూ.340 కోట్లతో వాటర్ స్కీమ్ మంజూరు చేయించారు. పథకాన్ని పూర్తి చేసేందుకు వేగంగా అడుగులు వేస్తున్నారు. దీనిని శంకుస్థాపన చేసేందుకు ఆగస్టులో సీఎం నగరానికి రానున్నారు.

నిరుపేదల సొంతింటి కల సాకారం:
నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యల్లో మరో ప్రధానమైంది పేదలకు సొంతిల్లు లేకపోవడం. దీన్ని గుర్తించిన బాలినేని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 25 వేల మందికి ఒకేచోట ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడంతోపాటు, ఇళ్లు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. అంత మందికి ఒకేచోట ఇల్లు నిర్మిస్తే ఏకంగా పట్టణమే ఏర్పడుతుందని అంతా ఆనందించారు. ఇది జరిగితే ఇక రాజకీయ భవిష్యత్తు భూస్థాపితమని భావించిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ టీడీపీ నేత ద్వారా కోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చి అడ్డుపడ్డారు. బాలినేని, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిలు ఏకంగా 508 ఎకరాలు కొనుగోలు చేసి మరీ 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా చేపట్టారు. వచ్చే నెలలో సీఎం చేతుల మీదుగా నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసే ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

డెయిరీకి పూర్వ వైభవం:
ఒంగోలు డెయిరీ పాడిపరిశ్రమపై ఆధారపడిన ఎంతో మంది రైతులకు దన్నుగా నిలిచింది. అయితే హెరిటేజ్‌ని అభివృద్ధి చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒంగోలు డెయిరీని నిర్వీర్యం చేశాడు. ఒంగోలు డెయిరీని టీడీపీ నేతలకు అప్పగించడంతో పూర్తిగా డబ్బులు కాజేసి, అప్పుల ఊబిలోకి నెట్టేశారు. దీంతో డెయిరీలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీన్ని గమనించిన సీఎం వై.ఎస్.జగన్ ఒంగోలు డెయిరీకి పునర్వైభవం తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. దీన్ని కూడా ఆగస్టు నెలలో సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మూడు బృహత్తర కార్యక్రమాల ప్రారంభానికి సీఎం రాక



ఒంగోలు నగరంలో మూడు బృహత్తర కార్యక్రమాలు చేపట్టేందుకు సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆగస్టు నెలలో ఒంగోలు రానున్నారు. గురువారం సీఎం వై.ఎస్.జగన్‌తో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఒంగోలు నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.340 కోట్లతో చేపట్టనున్న వాటర్ స్కీమ్‌తోపాటు, 25 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. అదేరోజు ఒంగోలు డెయిరీని పునః ప్రారంభించి పూర్వ వైభవం తెచ్చేలా అడుగులు వేయనున్నారు. ఇందుకోసం ఒంగోలులో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఒంగోలు నగర ప్రజల చిరకాల స్వప్నాలను తీర్చే దిశగా అడుగులు వేస్తున్నాం. ఒంగోలు అభివృద్ధిపై చర్చించేందుకే గురువారం సీఎం వై.ఎస్. జగన్‌ను కలిశాను.
– బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే

మహిళల ఆర్థికాభివృద్ధికి జగనన్న మార్టుల చేయూత

- మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- రాష్ట్రంలో 9వ మహిళా మార్టును ప్రారంభించిన మంత్రి సురేష్

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధికి జగనన్న మహిళా మార్టులు చేయూతనిస్తున్నాయని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మార్కాపురం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం స్వయం సహాయక మహిళా గ్రూపుల ఆధ్వర్యంలో రాష్ట్రంలో 9వ జగనన్న మహిళా మార్ట్‌ను ఆయన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం 21 సచివాలయాల పరిధిలో చెత్తను తరలించేందుకు ఈ–ఆటోలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా మార్టును ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్నీ మున్సిపాలిటీల్లో జగనన్న మహిళా మార్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తూ వారు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో జగనన్న మహిళా మార్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఉన్న గ్రూపుల్లోని మహిళలందరూ ఇందులో భాగస్వాములుగా ఉంటారని, ప్రతి మహిళా రూ.150 సభ్యత్వంతో కొనసాగుతారన్నారు. మహిళలు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులు ఉంటాయని చెప్పారు. బహుళజాతి సంస్థల ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేసి జగనన్న మహిళా మార్టులో అందుబాటులో ఉంచుతున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి సురేష్ చెప్పారు.



జగనన్న మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సురేష్, పక్కన ఎమ్మెల్యే కేపీ, సబ్‌కలెక్టర్

ఆహా క్యాంటీన్ ఏర్పాటు
ప్రజలకు మధ్యాహ్న సమయంలో తక్కువ ధరకు మంచి భోజనం అందించేందుకు ఆహా క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. రూ.30 కే పులిహోర, పెరుగన్నం, వెజిటబుల్ బిర్యానీ ఏర్పాటు చేస్తున్నామని, మధ్యాహ్నం 12 నుంచి 2 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సేథు మాధవన్, మెప్మా ఎండీ విజయలక్ష్మి, మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ సుబానీ, పట్టణ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, శ్రీశైల దేవస్థానం బోర్డు మెంబరు డాక్టర్ కనకదుర్గ, పార్టీ కౌన్సిలర్లు బుస్సెట్టి నాగేశ్వరరావు, కొత్త క్రిష్ణ, సిరాజ్, షెక్షావలి, మంగమూరి శ్రీను, డీ కరిముల్లా, డీ హర్షిత, అరుణ, రంగలక్ష్మి, భాను, ఆసిఫ్‌ఖాన్, కోఆప్షన్ సభ్యులు వనజాక్షి, మయూరి ఖాశీం, అమీరుల్లాఖాన్, రోజ్‌లిడియా, ఉత్తమ్ కుమార్, కరీంబాషా, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

- కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం స్పందన భవనంలో శుక్రవారం ప్రత్యేక స్పందన నిర్వహించి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక స్పందనలో ఉద్యోగులు ఇచ్చిన అర్జీలను స్పందన పోర్టల్‌లో నమోదు చేసి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యల్లో ఎక్కువగా డీడీవో పరిధిలో పరిష్కారం అయ్యే సమస్యలే అధికంగా ఉన్నాయన్నారు. దీనిపై డీడీవోలకు సర్క్యులర్ జారీ చేస్తామన్నారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత ఇతర అధికారులు పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, సచివాలయ ఉద్యోగులు అర్జీలు అందజేశారు.

నారా వారు సమర్పించు...ముఖాముఖి..ఉత్తిదే...

- వివిధ వర్గాల వారితో ముఖాముఖి అంటూ ఊదర
- పరుగు పందెంగా మారిన పాదయాత్ర
- సాయంత్రం 5 గంటలకు బస నుంచి బయటకు వచ్చిన లోకేష్
- అర్ధరాత్రి 12 గంటల వరకూ పాదయాత్ర
- మంత్రిగా ఉన్నప్పుడు జిల్లాను పట్టించుకోని లోకేష్
- ఇప్పుడొచ్చి అన్నీ చేస్తాను అని చెబుతుంటే నవ్వుకుంటున్న జిల్లా వాసులు

ఒంగోలు సబర్బన్: నారా వారు సమర్పించు... యువగళం పాదయాత్రలో లోకేష్ కార్యక్రమాల్లో ముఖాముఖిలు లేవు... సమావేశాలు లేవు... లోకేష్‌కు గోడు వెళ్లబోసుకున్న వారూ లేదు. ముందస్తు పథకం ప్రకారం తమ వారితో ప్లాన్ చేసిన కార్యక్రమాలను నిర్వహించడం, తర్వాత పచ్చ పత్రికలు పుంఖాను పుంఖాలుగా పేజీలలో అచ్చేయటం పరిపాటిగా మారింది. ముందుగా ప్రకటించే షెడ్యూలులో మాత్రం వివిధ వర్గాల వారితో లోకేష్ ముఖాముఖి నిర్వహిస్తారు అంటూ టీడీపీ నేతలు ఆర్భాటంగా ప్రకటిస్తారు. కానీ పాదయాత్ర మొదలయ్యేదే సాయంత్రం 5 గంటలకు. రోజువారీ షెడ్యూల్ 14 నుంచి 16 కిలో మీటర్లకు పైగా నిర్ణయించుకుంటున్నారు. ముందుగా ప్రకటించుకున్న దూరాన్ని చేరుకోవాలంటే ఉదయం 9 గంటలకు ప్రారంభమైతే సాయంత్రానికి యువగళం పాదయాత్రలో ముఖాముఖి కార్యక్రమాలు, ప్రజలు వచ్చి చెప్పుకునే కష్టాలు, బాధలు, గగ్గోలు పెట్టడంలాంటివి లోకేష్ వినిటానికి సమయం ఉంటుంది. అర్ధరాత్రి 12 గంటలకు వరకు నిద్ర మానుకొని ఎవరొచ్చి సమస్యలు చెప్పుకుంటారు. అధికారం చేతులో ఉండి అనుభవించినప్పుడు ప్రకాశం జిల్లాకానీ, జిల్లా ప్రజలు కానీ లోకేష్‌కు గుర్తుకు రాలేదు. రాష్ట్ర మంత్రిగా మూడు శాఖలు నిర్వహించి అధికారాన్ని అనుభవించారు. టిడ్కో ఇళ్ల విషయంలో జిల్లాలోని మార్కాపురం పట్టణానికి ఒకే ఒక్కసారి వచ్చి వెళ్లారు. జిల్లా కేంద్రం ఒంగోలు ముఖం కూడా చూడలేదు.



గ్రానైట్ రంగ ప్రతినిధులతో మాట్లాడుతున్న లోకేష్

కానీ అధికారం పోయిన తరువాత వచ్చి ఈ సారి అధికారంలోకి వస్తే అన్నీ చేస్తాం, మరిన్ని ఉచితంగా ఇస్తాం అని లోకేశం చెబుతుంటే జిల్లా ప్రజలు పక్కున నవ్వుకుంటున్నారు. జిల్లా కేంద్రం ఒంగోలులో శుక్రవారం మధ్యాహ్నం గ్రానైట్ కార్మికులతో ముఖాముఖీ అని ముందుగా ప్రకటించి కొందరు టీడీపీ అభిమానులు, పార్టీ నాయకులు, పార్టీకి చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆ తరువాత సెల్ఫీ కార్యక్రమం అని ముఖ్యులకే అవకాశం ఇచ్చి మరికొందరికి సెల్ఫీ అవకాశం ఇవ్వకపోవటంతో నానా తిట్లు తిట్టుకుంటూ వెళ్లిపోయారు. ఇక సాయంత్రం ఐదు గంటలకు ఒంగోలులోని పాత గుంటూరు రోడ్డులోని ఏ–1 ఫంక్షన్ హాలు విడిది చేసిన బస నుంచి యువగళం పాదయాత్ర ప్రారంభించారు. మంగమ్మ కాలేజీ వద్ద బైపాస్ జంక్షన్‌లో యువతతో సమావేశం అన్నారు. అక్కడ సమావేశం ఏమీ లేదు అంత ఉత్తిదే. ఆ తరువాత ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద రైతులతో సమావేశం అన్నారు. అదీ లేదు...అంతా ఉత్తిత్తికే. అయితే త్రోవగుంట వద్ద యువగళం పాదయాత్ర 2200 కిలో మీటర్ల మైలు రాయి అని మాత్రం శిలాఫలకం ఆవిష్కరించారు. త్రోవగుంట దాటిన తరువాత సంతనూతలపాడు నియోజకవర్గంలోని మద్దిపాడు మండలంలోకి లోకేష్ కార్యక్రమం ప్రవేశించింది. ఏడుగుండ్లపాడులో స్థానికులతో సమావేశం అన్నారు. అదీ కూడా జరగలేదు. అదీ ఉత్తుత్తిదే. సీతారాంపురం కొస్టాల వద్ద పొగాకు రైతులతో సమావేశం అన్నారు, మద్దిపాడులో స్థానికులతో సమావేశం అన్నారు, వెల్లంపల్లిలో మహిళలతో సమావేశం అన్నారు, రాత్రి 11.35 గంటలకు గుండ్లాపల్లి తిరిగి గ్రానైట్ కార్మికులతో ముఖాముఖి అని షెడ్యూలు ప్రకటించారు. అన్నీ ఉత్తుత్తిదే అన్నట్లు యువగళం లోకేష్ పాదయాత్ర రన్నింగ్ రేస్‌లా సాగుతోంది.

పారదర్శకంగా పంట నష్టం అంచనాలు

- కలెక్టర్ల వీడియో సమావేశంలో సీఎం జగన్

ఒంగోలు అర్బన్: పంట నష్టం అంచనా వేయడంలో పారదర్శకంగా ఎటువంటి లోపాలు లేకుండా నమోదు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్‌లు, ఎస్పీలతో తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో జిల్లాల్లో పంట నష్టంపై ఆరా తీశారు. సమావేశంలో ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసుల సంక్షేమానికి కృషి

● ఎస్పీ మలికాగర్గ్



పోలీసు సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ.. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఆర్ఐ శ్రీహరి రెడ్డి, ఎస్సై సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

శివపురంలో చెయిన్ స్నాచింగ్

● వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

టంగుటూరు: మండలంలోని శివపురం గ్రామంలో శుక్రవారం చెయిన్ స్నాచింగ్ జరిగింది. గ్రామానికి చెందిన ఎలుక చెంచమ్మ అనే వృద్ధురాలు శివారు ప్రాంతంలో పశువులు మేపుకుంటూ రోడ్డుపై నిలబడి ఉంది. నల్ల టీషర్టు ధరించి ద్విచక్ర వాహనంపై ఆమె వద్దకు వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి ఏదో అడ్రస్ అడుగుతున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. వృద్ధురాలు పెద్దగా కేకలు వేసినా చుట్టూ ఎవరూ లేకపోవడంతో ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

మట్కా ఆడుతున్న ఇద్దరు అరెస్టు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల గేటు సమీపంలో మట్కా ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను స్థానిక ఎస్సై మహేష్ గురువారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. మట్కా ఆడుతున్నారని తెలుసుకుని సోదాలు నిర్వహించగా, ఇద్దరు పట్టుబడ్డారని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని రూ.6,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 9 మందికి జైలు

ఒంగోలు టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 9 మందికి జైలు శిక్ష విధిస్తూ ఒంగోలు కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వారిని కోర్టు ముందు హాజరుపరచగా 15 రోజుల పాటు జైలు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ఘర్షణలో ముగ్గురికి గాయాలు

మార్కాపురం: చికెన్ కొనే విషయంలో జరిగిన వాగ్వాదం కాస్తా ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పట్టణంలోని కాలేజీ రోడ్డులో ఉన్న ఒక చికెన్ దుకాణానికి శుక్రవారం రాత్రి ఎం.రాజు చికెన్ కొనేందుకు వెళ్లాడు. తూకం వేసే విషయంలో చికెన్ షాపు నిర్వాహకులు నాయబ్‌రసూల్, అబ్దుల్ సలాంకు – రాజుకు మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో నాయబ్‌రసూల్, రాజుతో పాటు ఆయన సోదరుడు ప్రభాకర్‌కు కూడా గాయాలవడంతో ముగ్గురూ చికిత్స నిమిత్తం జిల్లా వైద్యశాలకు వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూరు.. హుషారు..!



మంత్రి ఆదిమూలపు సురేష్‌కు హారతిచ్చి బొట్టు పెడుతున్న మహిళ (ఫైల్)



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి సురేష్ (ఫైల్)

- వై.పాలెం నియోజకవర్గంలో నేటితో 100 రోజులు పూర్తి చేసుకోనున్న గడపగడపకు మన ప్రభుత్వం
- విజయవంతంగా కొనసాగిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్
- ఇప్పటి వరకు 99 రోజుల్లో 13,488 గృహాల సందర్శన
- 53 గ్రామ సచివాలయాల పరిధిలో 46 పనుల గుర్తింపు
- పూర్తి చేసేందుకు రూ.2.55 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- రూ.1.78 కోట్ల సొంత నిధులతో ప్రజా సమస్యలు పరిష్కరించిన మంత్రి
- పెద్దదోర్నాల మండలం కటకానిపల్లెలో నేడు వంద రోజుల పండుగ
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో రెట్టింపుకానున్న ఉత్సాహం

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని యర్రగొండపాలెం నియోజకవర్గంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఆదిమూలపు సురేష్ విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 99 రోజులు ఈ కార్యక్రమం నిర్వహించగా, 13,488 వేల కుటుంబాలను మంత్రి కలిశారు. వారికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఆరా తీసి సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. శనివారం 100వ రోజు సందర్భంగా పెద్దదోర్నాల మండలంలోని కటకానిపల్లెలో వైభవంగా వేడుక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆరోగ్య సమస్యలను సైతం లెక్కచేయకుండా...

రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించిన సమయంలో మంత్రి ఆదిమూలపు సురేష్ గుండె సమస్యతో బాధపడుతున్నారు. ఆ తర్వాత మోకాలి ఆపరేషన్ కూడా చేయించుకోవాల్సి వచ్చింది. అదే సమయంలో ఆయనకు మాతృవియోగం కూడా కలిగింది. ఇన్ని బాధలు ఎదుర్కొంటూ కూడా నియోజకవర్గ ప్రజలపై ఉన్న మమకారంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన కొనసాగించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..లేదా..? అని తెలుసుకోవడంతో పాటు ఇంకా ఏమైనా సమస్యలున్నాయేమో అని తెలుసుకుంటూ ముందుకు సాగారు. ప్రజలు చెప్పిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు.

గిరిజనగూడేలను సైతం వదలకుండా...

కనీసం వెళ్లేందుకు వీలు కూడా లేని నల్లమల అడవుల్లో ఉన్నటువంటి పాలుట్ల గిరిజనగూడేనికి కూడా మంత్రి సురేష్ వెళ్లి అక్కడ నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. రెండు రోజులపాటు అడవుల్లోనే ఉండి ప్రతి గిరిజనగూడేన్ని సందర్శించారు. ఆయా గూడేల్లో ఉన్నటువంటి సుగాలి, చెంచు తెగలకు చెందిన కుటుంబాల వారు మంత్రిని ఎంతగానో ఆదరించారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం...

నియోజకవర్గంలోని 86 సచివాలయాలకుగానూ 53 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను మంత్రి సురేష్ నిర్వహించారు. వాటి పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రకటించిన సచివాలయానికి రూ.20 లక్షల నిధులు సద్వినియోగం అయ్యేలా చూస్తున్నారు. ఇప్పటి వరకు 46 పనులకుగానూ రూ.2.55 కోట్లు మంజూరయ్యాయి. ఆయా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మరో 26 పనులు పూర్తయ్యాయి. వాటికి సంబంధించి రూ.1.20 కోట్లు అప్‌లోడ్ చేశారు. ఈ పనులతో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ బాగుపడింది.

సొంత నిధులతో డీప్‌బోర్లు...

నీటి సమస్యను కూడా పరిష్కరించాలని ప్రజలు కోరిన వెంటనే మంత్రి సురేష్ తన సొంత నిధులతో డీప్‌బోర్లు వేయించారు. నియోజకవర్గంలో 34 బోర్లు వేయించి రూ.1.2 కోట్లు అందజేశారు. ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లిన సమయంలో ఆ కుటుంబాల బాధలు తెలుసుకుని మహిళలు కోరిన వెంటనే 15 మందికి రూ.1.20 లక్షల విలువైన కుట్టుమిషన్లు అందజేశారు. పాలుట్లలో గృహ నిర్మాణాలు చేపట్టాలంటే దాదాపు 60 కిలోమీటర్ల దూరం నుంచి ఇసుక, ఇటుక, సిమెంటు, ఇనుము రవాణా చేసుకోవాల్సిన పరిస్థితి. అందుకు ఖర్చు ఎక్కువవుతుందని, తమను ఆదుకోవాలని గిరిజనులు కోరిన వెంటనే 150 గృహాలకు మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు అయ్యే పూర్తి ఖర్చును తానే భరాయిస్తానని రూ.75 లక్షల విలువచేసే సామగ్రిని గూడేనికి మంత్రి తరలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాలకు వెళ్తుంటే ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని, ఈ కార్యక్రమం వలన కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటివద్దకు వెళ్లి వారిని పలకరించే అవకాశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కల్పించడం చాలా ఆనందంగా ఉందని మంత్రి సురేష్ తెలిపారు. గ్రామస్తులు తనకు ఘన స్వాగతం పలుకుతున్నారని, అక్కచెల్లెమ్మలు హారతులు పడుతుంటే తన కళ్లనుంచి ఆనంద భాష్పాలు జాలువారాయని అన్నారు. మిగిలిన సచివాలయాల పరిధిలో కూడా ఈ కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తానని మంత్రి పేర్కొన్నారు.



మంత్రి సొంత నిధులతో పాలుట్లలో ఏర్పాటు చేస్తున్న బోరు (ఫైల్)

పాతిక వేల మందికి ఇళ్ల స్థలాలు



45వ డివిజన్‌లో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ మీనావెంకట్రావు

- వచ్చే నెలలో సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీ
- రూ.339 కోట్లతో ప్రతిరోజూ మంచినీరు అందించే పథకానికి శంకుస్థాపన
- రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: నగరంలో ఇళ్లు లేని నిరుపేదలు పాతికవేల మందికి వచ్చే నెలలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. అదే సమయంలో ప్రతిరోజూ నగరానికి మంచినీరు అందించే పథకానికి రూ.339 కోట్లతో సీఎం శంకుస్థాపన చేస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నగరంలోని 43, 44, 45, 46 డివిజన్ల పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి బాలినేని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ఏ చిన్న సర్టిఫికెట్ కావాలన్నా తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. కానీ, నేడు ఆ సమస్య లేకుండా సర్టిఫికెట్ కోసం ఎటువంటి రుసుం చెల్లించకుండా వలంటీర్లే ఇంటికొచ్చి అందించడం నిజంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపునకు నిదర్శనమని కొనియాడారు. పథకాల ద్వారా ఒక్కో డివిజన్ పరిధిలోని ప్రజానీకానికి గడిచిన నాలుగేళ్లలో దాదాపు రూ.9 కోట్లకుపైగా నగదు జమైందన్నారు. అంతేగాకుండా ప్రతి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల కోసం రూ.5 కోట్ల వరకు వెచ్చించినట్లు తెలిపారు.

600 మందికి ప్రతినెలా నా ఇంటి నుంచే పెన్షన్లు...

వివిధ కారణాల రీత్యా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న 600 మందికి ప్రతినెలా తన ఇంటి నుంచే పెన్షన్లు అందిస్తున్నట్లు బాలినేని తెలిపారు. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా త్వరలోనే ప్రతి ఇంటికి వస్తానని, సమస్యలు తెలుసుకుని పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. ఒంగోలులో సొంతిళ్లు లేని 25 వేల మందిని గుర్తించి పట్టాలిచ్చేందుకు ఏర్పాట్లు చేయగా, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ టీడీపీ నాయకులతో కోర్టులో కేసు వేయించి నిలుపుదల చేయించారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట దృష్ట్యా సీఎంతో మాట్లాడితే రూ.200 కోట్లతో స్థలాలు కొనుగోలు చేసి ప్రజలకు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. దాని ప్రకారమే భూములు కొనుగోలు చేశామన్నారు. దాంతోపాటు ప్రతిరోజూ పగటిపూటే మంచినీరు అందించేందుకు రూ.339 కోట్లను నగరానికి సీఎం కేటాయించారని, దానికి కూడా వచ్చే నెలలోనే సీఎం శంకుస్థాపన చేస్తారని బాలినేని వెల్లడించారు. ఆరు నుంచి ఏడు నెలల్లో ఆ పథకం కూడా పూర్తవుతుందని, ప్రజల నీటి కష్టాలు తొలగిపోతాయని బాలినేని తెలిపారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 45వ డివిజన్‌లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డి, 43, 44 డివిజన్లలో సంయుక్తంగా జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కార్పొరేటర్లు కండే స్వాతి రమణయాదవ్, గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి, 46వ డివిజన్‌లో కాపు కళ్యాణ మండపంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు విజయభాస్కర్ పాల్గొన్నారు. ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనా వెంకట్రావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, నగర నాయకుడు కటారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఎన్‌క్యూఏఎస్ బృందం



కొత్తపట్నం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో ఎన్‌క్యూఏఎస్ బృందం

కొత్తపట్నం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) బృందం సందర్శించింది. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై తనిఖీలు చేపట్టింది. బృంద సభ్యులైన చెన్నైకి చెందిన డాక్టర్ ప్రియా వసంతికుమారి, కలకత్తాకు చెందిన డాక్టర్ సోమజింత్ చక్రవర్తి పీహెచ్‌సీలో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందా.. లేదా..? అనే విషయంపై ఆరా తీశారు. ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ రికార్డులు తనిఖీ చేశారు. డెలివరీ రూం, ల్యాబ్, ఫార్మసీ విభాగాలను పరిశీలించారు. ఓపీ వివరాలను పరిశీలించారు. హాస్పిటల్ చుట్టూ ఉన్న గార్డెన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హాస్పిటల్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హాస్పిటల్ పరిసరాలను చూస్తుంటే ప్రైవేటు హాస్పిటల్ కంటే సుందరంగా ఉందన్నారు. రెండు రోజుల పాటు పీహెచ్‌సీని ఈ బృందం తనిఖీ చేయనుండగా, ముందుగా బృందానికి పీహెచ్‌సీ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా క్వాలిటీ మేనేజర్ ఎస్.ప్రసాద్, క్వాలిటీ కన్సల్టెంట్ ఆఫీసర్లు ఏఎస్ మురళీకృష్ణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.వైష్ణవి, డాక్టర్ పి.హేమంత్‌కుమార్, యూడీసీ కె.శరత్‌కుమార్, సీహెచ్‌వో ఓంకార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు, ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని మూడు గొర్రెలు మృతి

- మరో ఐదు గొర్రెలకు విరిగిన కాళ్లు, నడుములు
- విరిగిపడిన విద్యుత్ స్తంభం
- రూ.1.10 లక్షల నష్టం



సంఘటన స్థలంలో మృతిచెందిన గొర్రెలు

పామూరు: రోడ్డుపై వెళ్తున్న గొర్రెల మందను ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మరో ఐదు గొర్రెలకు కాళ్లు, నడుములు విరిగిపోయాయి. ఈ ఘటన శుక్రవారం ఉదయం 565వ నంబర్ జాతీయ రహదారిపై పామూరు సీహెచ్‌సీ సమీపంలో చోటుచేసుకుంది. పామూరుకు చెందిన ఇర్రి శ్రీనివాసులరెడ్డికి చెందిన గొర్రెలు మేత కోసం వెళ్తున్నాయి. ఆ సమయంలో కాకినాడ నుంచి అన్నమయ్య జిల్లా తరిగొండకు డీజిల్‌తో వెళ్తున్న ట్యాంకర్ అదుపుతప్పి గొర్రెలను ఢీకొట్టింది. కొన్ని గొర్రెలను ఈడ్చుకుంటూ వెళ్లి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగింది. ఈ ఘటనలో మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఐదు గొర్రెలకు కాళ్లు, నడుములు విరిగాయి. విద్యుత్ స్తంభం కూడా విరిగి కిందపడింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. మృతిచెందిన, గాయపడిన గొర్రెల విలువ సుమారు రూ.1.10 లక్షల వరకూ ఉంటుందని యజమాని తెలిపారు. కాగా, గొర్రెలే అకస్మాత్తుగా అడ్డొచ్చాయని ట్యాంకర్ డ్రైవర్ జి.సురేంద్ర తెలిపారు.

సమర్థవంతంగా ప్రజాపంపిణీ

● జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు టౌన్: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సమర్థవంతంగా రేషన్ పంపిణీ చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక జేసీ చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణీని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రేషన్ సరఫరాలో నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. గత ఆరు నెలల కాలంలో అక్రమాలకు పాల్పడుతున్న 12 రేషన్ దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ రవాణా, నిల్వలు, పీడీఎస్ బియ్యం తరలింపులపై 21 6ఏ కేసులు నమోదు చేశామన్నారు. అలాగే 7 రైసు మిల్లులపై దాడులు చేసి 12 కేసులు నమోదు చేసి 1943.46 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రేషన్ పక్కదారి పట్టకుండా రేషన్ షాపునకు సరుకు చేరిన తర్వాత మూడు దశలుగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దుకాణాలకు సరుకు చేరిన తర్వాత నెల మొదట్లో ఒకసారి, నెల మధ్యలో మరోసారి, చివరిగా పంపిణీ ముందు గ్రామ రెవెన్యూ అధికారులచే తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎండీయూల పంపిణీ సమయంలో గ్రామ రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారని, వలంటీర్లు పంపిణీ సమయంలో దగ్గరుండి మరీ పంపిణీ సక్రమంగా జరిగేలా చూస్తున్నారని చెప్పారు. విలేకరుల సమావేశంలో డీఎస్ఓ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

సీఎం జిల్లా వారైతే అనర్హులా!

సాక్షి, అమరావతి: విదేశీయులు మన దేశంలో కంపెనీలు, పరిశ్రమలు స్థాపిస్తున్నారు. మన రాష్ట్రం నుంచి ఎంతో మంది దేశ, విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ఆ ఊరు, ఈ ఊరు అనే తేడా లేదు. జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు ఎక్కడైనా అర్హత ఉన్న ఎవరైనా చట్టం, నిబంధనల మేరకు ఏదైనా చేయవచ్చు. దీనిని విశ్వవ్యాప్తంగా ఎవరూ కాదనరు. కానీ ఈనాడుకు మాత్రం సీఎం సొంత జిల్లా వారు ఎలాంటి వ్యాపారాలు చేయకూడదని, టెండర్లు దక్కించుకోకూడదన్న అభిప్రాయం నరనరానా జీర్ణించుకుపోయింది. అందుకే వారు వ్యాపారాలకు అనర్హులనేలా కథనాలు అల్లుతోంది. పెరుగుతున్న రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చ దానికి సీలేరులో రెండు అదనపు విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) టెండర్లు పిలిచింది. అత్యంత పారదర్శకంగా బిడ్లు ఆహ్వానించి, రివర్స్ టెండరింగ్ ద్వారా టెండరు ఖరారు చేసింది. కానీ ఇదంతా తప్పన్నట్టు 'ఈనాడు' శుక్రవారం ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఆ పత్రిక అధినేత రామోజీరావు పచ్చళ్లు అమ్ముకోవచ్చు.. పత్రికనూ నడుపుకోవచ్చు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే కంపెనీకి మాత్రం విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు టెండర్ ఇవ్వకూడదు. వారికి, వారు కొమ్ముకాస్తున్న వారికి ఒక న్యాయం.. సీఎం సొంత జిల్లా వారైతే మరో న్యాయం.. ఇదేం రామోజీ జర్నలిజం. ఏపీ జెన్‌కో వెల్లడించిన వివరాల ప్రకారం ఈ టెండర్లలో వాస్తవాలు అంశాల వారీగా ఇలా ఉన్నాయి.

ఆరోపణ: వైఎస్సార్ జిల్లాకు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ విద్యుత్ ప్రాజెక్టును కట్టబెట్టింది. ఈ సంస్థ వైఎస్సార్ జిల్లాకు చెందిన వ్యక్తికి సంబంధించినది కావడమే దానికి ఉన్న ఏకైక అర్హత.

వాస్తవం: ఏపీ జెన్‌కో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన రివర్స్ టెండరింగ్ ద్వారానే షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ఈ కాంట్రాక్టును కైవసం చేసుకుంది. ఇందులో ఏపీ జెన్‌కో, ప్రభుత్వం ప్రమేయం ఏమీ లేదు. ఈ కన్సార్టియం భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన ప్రతిష్టాత్మక బీహెచ్ఈఎల్‌తో ఈ ప్రాజక్టు యంత్ర పరికరాల సరఫరాకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం ఉన్న యూనిట్లకు కూడా బీహెచ్ఈఎల్ యంత్ర పరికరాలు సరఫరా చేసింది. కన్సార్టియంలోని మరో కంపెనీ పీఈఎస్‌కు ఇదివరకే ఈ ప్రాజక్టులో సివిల్ పనులు చేసిన అనుభవముంది. ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకుని, కాంట్రాక్టు సంస్థను ఎంపిక చేసింది. ఈ ప్రాజక్టు పనులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 2024కల్లా పూర్తవుతాయి.

ఆరోపణ: దిగువ సీలేరులో రెండు అదనపు యూనిట్ల నిర్మాణానికి అయ్యే వ్యయం, జీఎస్టీ, ఆలస్యానికి అయ్యే వడ్డీతో కలిపి రూ. 571 కోట్ల రుణాన్ని గ్రామీణ విద్యుత్ సంస్థ (ఆర్ఈసీ) నుంచి ప్రభుత్వం తీసుకుంది.

వాస్తవం: పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రుణం తీసుకోవడం సర్వసాధారణం. ఇందులో తప్పేముంది?

ఆరోపణ: ఇప్పటికే షిర్డీ సాయి, దాని అనుబంధ సంస్థలకు రూ. 92 వేల కోట్ల విలువైన వివిధ విద్యుత్ ప్రాజెక్టులను ప్రభుత్వం కట్టబెట్టింది.

వాస్తవం: ఏపీ జెన్‌కోగానీ, డిస్కంలు గానీ నామినేషన్ పద్ధతిలో ఏ పనులూ ఎవరికీ కేటాయించలేదు. వివిధ ప్రాజెక్టుల కోసం పారదర్శకంగా టెండర్లు నిర్వహించాయి. అర్హతల మేరకు పోటీ బిడ్డింగ్‌లో పాల్గొని ఏ సంస్థ అయినా పనులు దక్కించుకోవచ్చు.

ఆరోపణ: ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే కంపెనీకి జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రభుత్వం కట్టబెట్టింది.

వాస్తవం: అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ (గ్లోబల్ టెండర్లు- ఇ ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫారం) ద్వారా ఏపీ జెన్‌కో టెండర్లు పిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జుడిషియల్ కమిషన్ కూడా సమీక్షించి ఈ ప్రాజెక్టు టెండర్లకు ఆమోదం తెలిపింది. రాఘవ ఎంటర్‌ప్రైజెస్, ఎన్‌సీసీ, పీఈఎస్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిపి షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ జాయింట్ వెంచర్ సంస్థ బిడ్లు దాఖలు చేసింది. టెండర్లలో కోట్ అయిన అతి తక్కువ మొత్తాన్ని గరిష్టంగా తీసుకుని ఏపీజెన్‌కో రివర్స్ టెండర్లు నిర్వహించింది. ఈ రివర్స్ టెండరింగ్‌లో షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ తక్కువ మొత్తానికి ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చి కాంట్రాక్టు దక్కించుకుంది. రెండు దశల (సాంకేతిక, ఆర్థిక) బిడ్డింగ్ ప్రాతిపదికన ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు సంస్థను ఎంపిక చేసింది. రివర్స్ టెండరింగ్ ప్రక్రియ వల్ల ఏపీ జెన్కోకు దాదాపు రూ.10 కోట్లు ఆదా అయ్యింది.

ఆరోపణ: ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పర్యావరణ, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) అనుమతులు రాకముందే హడావుడి చేసింది.

వాస్తవం: విద్యుత్ కేంద్రం ప్రతిపాదనను ఏపీఈఆర్‌సీకి ముందే చెప్పారు. ప్రతిపాదనను పరిశీలించి డిస్కంలు, జెన్‌కో కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకుని కమిషన్ అనుమతి కోసం అప్పుడు పంపాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అనుమతి ఈ నెల 7న వచ్చింది. ఈ ప్రాజెక్టు పెట్టుబడి వ్యయం రూ.1000 కోట్లు దాటనందున కేంద్ర విద్యుత్ ప్రాధికారిక సంస్థ (సీఈఏ) అనుమతి అవసరం లేదు.

ఆరోపణ: రెండు కొత్త యూనిట్లు నిర్మించడం వల్ల దిగువ సీలేరు ప్రాజెక్టు నుంచి అదనంగా ఒక్క యూనిట్ విద్యుత్ కూడా ఉత్పత్తి అయ్యే పరిస్థితి లేదు.

వాస్తవం: జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి మన గ్రిడ్ అవసరాలకు అనుగుణంగా మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం ఉన్న నాలుగు 115 మెగావాట్ల యూనిట్లు ఏటా దాదాపు 1100 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నాయి. దిగువ సీలేరు విద్యుత్ కేంద్రం మొట్టమొదట నిర్మించినప్పుడే ఆరు యూనిట్ల ఏర్పాటుకు కావలసిన ప్రధాన మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో అదనంగా మరో రెండు 115 మెగావాట్ల యూనిట్లు నిర్మించాలని ఏపీ జెన్‌కో నిర్ణయించింది. కొత్త యూనిట్లు నెలకొల్పడం వల్ల ఈ విద్యుత్ కేంద్రం గరిష్ట లోడ్ సామర్థ్యం పెరుగుతుంది. దాంతో మార్కెట్ నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనవలసిన అవసరం తగ్గుతుంది. ప్రతి 115 మెగావాట్ల యంత్రం పీక్ డిమాండ్ సమయంలో సగటున 175 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయగలదు. దీనివల్ల డిస్కంలకు ఏటా 350 మిలియన్ యూనిట్లు విద్యుత్ మార్కెట్‌లో కొనాల్సిన అవసరం తగ్గి, ఆ మేరకు లాభం చేకూరుతుంది. పీక్ సమయాల్లో మార్కెట్ రేటు యూనిట్‌కు దాదాపు రూ.10 ఉంటోంది. సరాసరి పీక్ లోడ్ విద్యుత్ ధర రూ.8.0 అనుకున్నా ఈ రెండు యూనిట్ల వల్లా ఏటా దాదాపు రూ .280 కోట్లు ఆదా అవుతుంది.

నా వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేశారు

▶ మొదటి పేజీ తరువాయి



ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. సీబీఐ డైరెక్టర్‌ని, వివేకా కేసు విచారణాధికారి (ఏఎస్పీ)ని ప్రతివాదులుగా చేర్చారు. పిటిషన్‌లో ఆయన పేర్కొన్న వివరాలు.. 'ఏప్రిల్ 29న నేను వాంగ్మూలం ఇస్తుండగా.. అధికారి మరొకరిని లోపలికి పిలిచారు. ఆయన లాప్‌ట్యాప్‌తో వచ్చి ఏదో రికార్డు చేసుకున్నాడు. ఆయన ఏం రికార్డు చేసింది నాకు చూపించలేదు. కనీసం చదివి వినిపించలేదు. నాకు తెలిసినంతవరకు నా వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో రికార్డు కూడా చేయలేదు. సీబీఐ నా స్టేట్‌మెంట్‌ను తప్పుడు రికార్డు చేసినట్లు మే 17న ఓ పత్రికలో ప్రచురితమైన వార్త ద్వారా తెలుసుకున్నా. నా వాంగ్మూలం గురించి నేను ఎవరి వద్దా ప్రస్తావించలేదు. కానీ, ఆ పత్రికలో ఎలా వచ్చిందో నాకు అర్థంకాలేదు. ఆశ్చర్యం వేసింది. ఆ పత్రికలో పేర్కొన్నదంతా అసత్యపూరితం. పత్రికలో వచ్చిన దానిపై ఎలక్ట్రానిక్ మీడియా చర్చా కార్యక్రమాలు పెట్టడంతో నేను విలేకరుల సమావేశం పెట్టి.. ఆ పత్రికది కట్టుకథ అని చెప్పాల్సి వచ్చింది. సీబీఐ నమోదు చేసింది కూడా నేను చెప్పింది కాదని తెలిసింది. అయితే సీఆర్‌పీసీ 161 కింద రికార్డు చేసిన కాపీ నావద్ద లేనందున నా వాంగ్మూలం తప్పుగా పేర్కొన్న విషయాన్ని తెలుసుకోలేక పోయా. 2019 మార్చి 15న ఉదయం 5.30 గంటల సమయంలో అటెండరు వచ్చి అమ్మ (భారతి) పిలుస్తున్నారంటూ జగన్‌కు చెప్పాడని తాను చెప్పినట్లు, బయటకు వెళ్లిన జగన్ పది నిమిషాల తరువాత తిరిగివచ్చి చిన్నాన్న ఈజ్ నో మోర్ అని అన్నారని, షాక్‌కు గురైన మేము కడపకు వెళ్లాలని ఆయనకు సూచించి బయటకు వచ్చేశామని జూన్ నెలలో వేసిన చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది. ఈ విషయం పత్రికల్లో వచ్చిన సమాచారం ద్వారా నాకు తెలిసింది.

ఏం చెప్పానంటే..

ఏప్రిల్ 29న నన్ను విచారించిన అధికారికి స్పష్టంగా ఏం చెప్పానంటే.. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో తయారీ సమావేశం 2019 మార్చి 15న ఉదయం సుమారు 5 గంటలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లో ప్రారంభమైంది. అరగంట తర్వాత ఒక అటెండర్ సమావేశగది తలుపు తట్టాడు. బయటికి వెళ్లి విషయం తెలుసుకుని వచ్చిన ఓఎస్డీ.. జగన్ చెవిలో ఏదో చెప్పారు. దీంతో జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి, ఆశ్చర్యానికి గురయ్యారు. 'చిన్నాన్న చనిపోయారు' అని చెప్పారు. అంతేతప్ప జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన జీవిత భాగస్వామిని పిలవడం లాంటివి ఏమీ చెప్పలేదు. దురదృష్టవశాత్తు నేను చెప్పింది సీబీఐ సరిగ్గా రికార్డు చేయలేదు. చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది పూర్తిగా అసంబద్ధం. దర్యాప్తును తప్పుదారి పట్టించి.. ఇతరులను కేసులో ఇరికించే ధోరణితోనే సీబీఐ ఇలా తప్పుగా పేర్కొంది. నా స్టేట్‌మెంట్‌పై సంతకం చేసిన అధికారి, నన్ను విచారించిన అధికారి ఒకరు కాదు. దర్యాప్తు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రాజ్యాంగ ధర్మాసనాలు పదేపదే చెబుతున్నా.. కొందరు మాత్రం వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. దర్యాప్తు చేయడం అంటే అస్పష్టమైన సత్యాన్ని బయటికి తీసుకురావడం. కానీ, ఇక్కడ అధికారులు అలా వ్యవహరించలేదు. నేను చెప్పకున్నా చెప్పినట్లు సీబీఐ తప్పుడు వాంగ్మూలాన్ని సమర్పించడం ఎంత మాత్రం సరికాదు. ఇతర వ్యక్తులను చిక్కుల్లో పడేసేందుకే సీబీఐ తప్పుడు సమాచారం చేర్చింది. ఈ అంశాలను పరిశీలించి హైదరాబాద్ సీబీఐ కోర్టులో సమర్పించిన చార్జిషీట్ నుంచి తప్పుడు వాంగ్మూలాన్ని తొలగించాలి.'

ఏపీ ఇన్ పార్లమెంట్

ప్రత్యేకదళాల్లో చేరికకు లింగభేదం లేదు

సాక్షి, న్యూఢిల్లీ: భారత సాయుధ దళాల్లోని ప్రత్యేకదళాల్లో చేరడానికి లింగభేదం లేదని కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి అజయ్ భట్ తెలిపారు. గుణాత్మక అవసరాల మేరకు ఎంపిక, విజయవంతమైన శిక్షణ పూర్తిచేస్తే మహిళా అధికారులు ఎలాంటి లింగభేదం లేకుండా ప్రత్యేకదళాల్లో స్వచ్ఛందంగా చేరడానికి అర్హులని చెప్పారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు వంగా గీత, బి.వి.సత్యవతి, గొడ్డేటి మాధవి, ఆదాల ప్రభాకరరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. భారత వైమానిక దళంలో ఇద్దరు మహిళలు ప్రత్యేకదళాల శిక్షణకు స్వచ్ఛందంగా వచ్చారని, అయితే వారు ఉత్తీర్ణత సాధించలేకపోయారని తెలిపారు. నేవీలో 20 మంది అగ్నివీర్‌లు ప్రత్యేకదళంలో చేరడానికి పరీక్షకుహాజరయ్యారని, వారెవరూ అర్హత సాధించలేకపోయారని చెప్పారు.

దేశవ్యాప్తంగా 122 మంది మెడికోల ఆత్మహత్య

దేశవ్యాప్తంగా 559 వైద్య కళాశాలలు ఇచ్చిన సమాచారం మేరకు 122 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి భారతీప్రవీణ్ పవార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. నేషనల్ మెడికల్ కమిషన్‌లోని యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆర్‌టీఐ దరఖాస్తుకు సమాధానంగా ఐదేళ్లలో ఆత్మహత్యలు, డ్రాప్ అవుట్‌ల వివరాలు ఇచ్చిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పీజీలో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా.. తొమ్మిది కళాశాలల్లో 38 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారని తెలిపారు. ఎంబీబీఎస్‌లో మూడు కళాశాలల్లో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా.. ఆరు కళాశాలల్లో 13 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారని చెప్పారు.

మైన్స్ మినరల్స్ సవరణ బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు

మైన్స్, మినరల్స్ సవరణ బిల్లు-2023కు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. ఈ బిల్లుపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం 16,604 ఎకరాల్లో 16 బీచ్‌శాండ్ మినరల్స్ బేరింగ్ ఏరియాలను ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు రిజర్వు చేసిందని తెలిపారు. 14 మినరల్ బేరింగ్ ఏరియాలకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ బీచ్‌శాండ్ మినరల్స్ ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ స్థాపించి వైఎస్సార్ జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా రాయలసీమ ప్రజలకు స్థిరమైన ఉపాధి, జీవనోపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఉక్కు కర్మాగారం ఏడాదికి మూడు మిలియన్ టన్నుల సామర్థ్యంతోపాటు హై-గ్రేడ్ స్టీల్ ఉత్పత్తిపై దృష్టి సారిస్తుందని తెలిపారు.

మాయల ఫకీరు బాబు మాయలో పడొద్దు

- పురందేశ్వరి వ్యాఖ్యలపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కౌంటర్

సాక్షి, విశాఖపట్నం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాటలు ఆమె మరిది చంద్రబాబు స్క్రిప్టులా ఉన్నాయి తప్ప సొంతంగా మాట్లాడారని అనిపించడంలేదని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలా? లేక బాబు గారి జనతా పార్టీకి అధ్యక్షురాలా? అనే సందేహం వస్తోందన్నారు. మంత్రి శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. మాయల ఫకీరు చంద్రబాబు ట్రాప్‌లో పడితే పురందేశ్వరి భర్త దగ్గుబాటి వెంకటేశ్వర్లు రాజకీయ జీవితం భూస్థాపితం అయిపోయినట్లే ఆమె రాజకీయ జీవితమూ ముగిసిపోతుందని చెప్పారు. ఆమె భర్త ఆనాడు రాసిన పుస్తకానికి పార్ట్-2 రాయాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నీ మద్యం ఆదాయంతోనే ఇస్తున్నారని అంటున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మద్యం లేదా? ఆదాయం రావడంలేదా అని ప్రశ్నించారు. వివిధ విభాగాల ఆదాయంతోనే ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వ నిర్ణయాలు, హామీలను అమలు చేస్తారని చెప్పారు. పురందేశ్వరి ఆమె మరిది బాబు హయాంలోని భూ కుంభకోణాలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. విశాఖ ఎంపీగా చేసిన ఆమె విశాఖ రైల్వే జోన్‌పైన, విశాఖ ఉక్కు పైన ఎందుకు మాట్లాడటంలేదని నిలదీశారు.

సినిమా

పట్టుకుంటే పది వేలు


● ధనుష్

బందిపోటుగా, హంతకుడిగా ముద్రపడిన 'కెప్టెన్ మిల్లర్'ను పట్టుకున్న వారికి పదివేల రూపాయల రివార్డును ప్రకటిస్తూ 1930లో ఓ పోలీస్ నోట్ విడుదలైంది. మరి.. అప్పటి ప్రభుత్వానికి కెప్టెన్ మిల్లర్ చిక్కాడా? అసలు అతని కథ ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానాలు డిసెంబరులో థియేటర్స్‌లో దొరుకుతాయి. ధనుష్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో టీజీ త్యాగరాజన్, సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) ధనుష్ బర్త్ డే. ఈ సందర్భంగా 'కెప్టెన్ మిల్లర్' టీజర్‌ను విడుదల చేసి, సినిమాను డిసెంబరు 15న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో 'కెప్టెన్ మిల్లర్'లో కీలక పాత్ర చేసిన హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఈ సినిమా కాకుండా ధనుష్ అన్న దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డీ 50'లోనూ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాను'' అని అన్నారు. ''1930–1940 నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీ రోల్ చేస్తున్నారు.

నెచ్చెలి విసిరినది వెచ్చని వల...


● సమంత, విజయ్ దేవరకొండ

'ఖుషీ నువు కనబడితే.. ఖుషీ నీ మాట వినబడితే...' అంటూ మొదలైంది 'ఖుషి' సినిమా టైటిల్ సాంగ్. విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం ఇది. శివ నిర్వాణ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం సెప్టెంబరు 1న విడుదల కానుంది. ఈ సినిమా టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. 'ఖుషీ నువు కనబడితే' అని మొదలై, 'హే నెచ్చెలి నెచ్చెలి వచ్చి విసిరినది వెచ్చని వెచ్చని వల.. హే ముచ్చటగా నను గిల్లి గిచ్చినది కల..' అంటూ సాగుతుందీ పాట. దర్శకుడు శివ నిర్వాణ ఈ పాటకు లిరిక్స్ అందించగా, ఈ చిత్ర సంగీత దర్శకుడు హిషామ్ అబ్దుల్ వాహబ్ పాడారు.

లక్కీ భాస్కర్


● దుల్కర్ సల్మాన్

'మహానటి, సీతారామం' వంటి వరుస విజయాల తర్వాత తెలుగులో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ధనుష్‌తో 'సార్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) దుల్కర్ సల్మాన్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ప్రకటించారు. ''నమ్మశక్యం కాని విధంగా ఉన్నత శిఖరాలకు చేరిన ఒక సాధారణ మనిషి కథగా 'లక్కీ భాస్కర్' రూపొందుతోంది. ఈ చిత్రం ద్వారా వెంకీ అట్లూరి మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు'' అని నిర్మాతలు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

'కాంత'.. దుల్కర్ బర్త్ డే సందర్భంగా 'కాంత' అనే మరో చిత్రం ప్రకటన వెల్లడైంది. ఈ చిత్రంలో దుల్కర్ హీరోగా నటించడంతో పాటు రానాతో కలిసి నిర్మిస్తున్నారు. గతంలో 'నిలా' చిత్రం, 'ద హంట్ ఆఫ్ వీరప్పన్' డాక్యుమెంటరీ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ 'కాంత'ను తెరకెక్కించనున్నారు.


● అదితీరావ్ హైదరి

అంతా మంచే జరుగుతుంది

\- విష్ణు మంచు


● తేజ్, విష్ణు మంచు, రిషిక

''ఇండస్ట్రీలో ఓ యాక్టర్‌కి, మేకప్ మేన్‌కి ఉన్న బంధం భార్యాభర్తల్లాంటిది. నేను చిన్నప్పటి నుంచి మేకప్‌మేన్ చంద్రగారిని చూస్తున్నాను. ఓ రైటర్‌గా, డైరెక్టర్‌గా, నిర్మాతగా సినిమా చేయటం అంత సులభం కాదు.. ఆయన మంచి మనసుకి అంతా మంచే జరుగుతుంది. 'మాధవే మధుసూదనా' సినిమా పెద్ద సక్సెస్ కావాలి'' అని హీరో విష్ణు మంచు అన్నారు. తేజ్ బొమ్మదేవర, రిషికా లోక్రే జంటగా రూపొందుతోన్న చిత్రం 'మాధవే మధుసూదనా'. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో బొమ్మదేవర రామచంద్ర రావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను విష్ణు మంచు రిలీజ్ చేశారు. బొమ్మదేవర రామచంద్ర రావు మాట్లాడుతూ–'' నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన అన్నపూర్ణ స్టూడియో సంస్థకు, నాగార్జునగారికి రుణపడి ఉంటాను. మోహన్ బాబుగారు సింగపూర్‌లో ఉండటం వల్ల ఆయన స్థానంలో విష్ణుని పంపించినందుకు కృతజ్ఞతలు'' అన్నారు.

హద్దుల్లో ఉంటే అడ్డే ఉండదు

\- హీరోయిన్ శ్రీలీల



''చిత్ర పరిశ్రమ అనేది గౌరవం ఉన్న ఇండస్ట్రీ. మన హద్దుల్లో మనం ఉండి సినిమాలు చేసుకుంటే అడ్డేదీ ఉండదు.. ఎలాంటి ఇబ్బందులు రావు. తెలుగమ్మాయి అయిన హీరోయిన్ ప్రణవికి నేను ఇచ్చే సలహా ఇదే'' అని హీరోయిన్ శ్రీలీల అన్నారు. సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమా రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ ద్వారా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలీల మాట్లాడుతూ– ''స్లమ్ డాగ్ హజ్బెండ్ సినిమా సూపర్ హిట్ కావాలి'' అన్నారు. ''మా సినిమాలో వినోదం, భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి'' అన్నారు ఏఆర్ శ్రీధర్. ''శ్రీలీల, వైష్ణవీ చైతన్య, ప్రణవి తెలుగు అమ్మాయిలే. నా కొత్త సినిమాకు తెలుగు అమ్మాయినే హీరోయిన్‌గా తీసుకుంటా'' అన్నారు డైరెక్టర్ బుచ్చిబాబు సానా. ''స్లమ్ డాగ్ హజ్బెండ్ హిట్ అయితే మరో పది మంది కొత్తవాళ్లకు అవకాశాలు ఇస్తాం'' అన్నారు అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి.

తొలి అడుగు

ఇటు సౌత్.. అటు నార్త్.. కాస్త ఖాళీ దొరికితే డిజిటల్ వరల్డ్... ఇలా వరుస ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంటున్నారు హీరోయిన్ అదితీరావ్ హైదరి. అయితే తొలిసారి ఈ బ్యూటీ ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ సమాచారం. తమిళ దర్శక–నటుడు రాజేష్ ఎమ్. సెల్వ ఇటీవల కథానాయిక ప్రాధాన్యంగా సాగే ఓ కథ తయారు చేశారని, ఈ కథ విని, ఇందులోని పాత్ర నచ్చడంతో అదితీరావ్ హైదరి పచ్చ జెండా ఊపారని కోలీవుడ్ టాక్. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెలలో ఆరంభం కానుందట. లేడీ ఓరియంటెడ్ చిత్రాల పరంగా అదితీకి ఇది తొలి అడుగు. మరి.. ఈ తొలి అడుగుతో ఈ తరహా చిత్రాలు ఇంకెన్ని చేస్తారో చూడాలి. ఇక 'సమ్మోహనం, వి, అంతరిక్షం, మహాసముద్రం' వంటి చిత్రాలతో అదితీరావ్ హైదరి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే.

రీల్స్

డబుల్ ఇస్మార్ట్‌లో..


● సంజయ్ దత్

తెలుగులో మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారట బాలీవుడ్ నటుడు సంజయ్ దత్. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని ఓ కీలక పాత్రకు సంజయ్ దత్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఈ చిత్రంలో భాగం కావడానికి సంజయ్ దత్ సుముఖంగా ఉన్నారని టాక్.

కేరాఫ్ దెయ్యం...


● రవిబాబు

ఒకప్పుడు గ్రామాల్లో మాతంగులుగా జీవించిన వారిలో ఒక స్త్రీ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'భయం.. కేరాఫ్ దెయ్యం'. మాతంగిగా రమ్య, మాంత్రికుడిగా నటుడు–దర్శకుడు రవిబాబు, తాంత్రికుడిగా నటుడు సత్యప్రకాష్ ముఖ్య పాత్రలు చేశారు. సీఏఎస్ఎం వెంకట రవీందర్ నాథ్ దర్శకత్వంలో పెదారికట్ల చేనెబోయిన్న నరసమ్మ, వెంకటేశ్వర్లు నిర్మించారు. ''హారర్, థ్రిల్లర్ అంశాలు జోడించి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇటీవల జరిపిన రెండో షెడ్యూల్‌లో రవిబాబుపై సీన్స్ తీశాం. కన్నడ, తెలుగు భాషల్లో నిర్మించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో తెలియజేస్తాం'' అని దర్శక–నిర్మాతలు అన్నారు.

రోడ్స్ బ్లాకు...


● శివానీ, శ్రీ కమల్

'ఆకు పాకు ఇస్తరాకు.. ఆల్ సైడ్స్ రోడ్స్ బ్లాకు..' అంటూ సాగే పాట 'జిలేబి' చిత్రంలోనిది. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి', 'మన్మథుడు' వంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు కె. విజయ భాస్కర్ కొంత గ్యాప్ తర్వాత తెరకెక్కించిన చిత్రం ఇది. శ్రీ కమల్, శివానీ రాజశేఖర్ జంటగా గుంటూరు రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమాలోని 'ఆకు పాకు..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరకల్పనలో రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు.

ఓ ప్రేమకథ


● మోక్ష, వికాస్ వశిష్ఠ, కుషిత

వికాస్ వశిష్ఠ, మోక్ష, కుషిత కళ్లపు హీరో హీరోయిన్లుగా అంజిరామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'నీతోనే నేను'. ఈ సినిమా టైటిల్, పోస్టర్‌ను చిత్ర నిర్మాత ఎమ్. సుధాకర్ రెడ్డి బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేశారు. ''చదువుకునే టైమ్‌లోనే సినిమా తీయాలనే కల ఉండేది. మంచి టీమ్‌తో 'నీతోనే నేను' తీశాను'' అన్నారు ఎమ్. సుధాకర్ రెడ్డి. ''ఈ సినిమా కోసం టీమ్ ప్రాణం పెట్టి పని చేశారు'' అన్నారు అంజిరామ్. ''ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే చిత్రమిది'' అన్నారు వికాస్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నవీన్, కెమెరామేన్ మురళీ మోహన్, మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్ బి. కడగండ్ల పాల్గొన్నారు.